నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

సంచిక : 224 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం 27-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

ఎండకాలమందు నెండలు లేవంట
వర్షకాలమందు వానలేదు
చలియుపుట్టలేదు చలికాలమందున
పోయెకాలమొచ్చె పుడమియందు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




## రేవంత్ రియల్ ఎస్టేట్ కోసమే.. జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం

- పాలన వికేంద్రీకరణ కేసీఆర్ పాలసీ.. నేడు రివర్స్
- రాహుల్, రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

వరంగల్,
రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాలిటీలను విలీనం చేయాలని చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజల గడప వద్దకు ప్రభుత్వం చేరాలని.. కేసీఆర్ పాలనను వికేంద్రీకరిస్తే.. అధికారం పేరుతో దోచుకోవడాన్నే రేవంత్‌రెడ్డి పాలసీగా ఎంచుకున్నారని నిప్పులు చెరిగారు. పారిశ్రామిక వాడలకు చెందిన భూములను అప్పనంగా తన వందిమాగదులకు కట్టబెట్టేందుకు రేవంత్‌రెడ్డి స్కెచ్ వేశారని ధ్వజమెత్తారు. అపార్ట్‌మెంట్లు, మాల్స్ కోసం పరిశ్రమల భూములను కేటాయిస్తారా? అని ప్రశ్నించారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ భూములపై కన్నేసి..

-మిగతా 2 లో

## ఎయిరో స్పేస్..డిఫెన్స్ హబ్‌గా

# హైదరాబాద్

### తెలంగాణ అభివృద్ధిలో మరో మైలురాయి

- హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారింది
- బెంగుళూరు-హైదరాబాద్ నగరాలను డిఫెన్స్, ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలి
- ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుంది
- సాఫ్రన్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ

హైదరాబాద్ / శంషాబాద్ నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
సాఫ్రన్ సంస్థ తన ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పడం తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రన్ సంస్థ, ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా బుధవారం హైదరాబాద్ జీఎంఆర్ ఎయిరోపార్క్ (ఎస్ఈజెడ్)లో నెలకొల్పిన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ప్రధాని మోడీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ..హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్

-మిగతా 2 లో





## ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

- ఢిల్లీ సంవిధాన్ సదన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం
- 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభ
- ఆయా భాషల్లో ప్రచురించిన రాజ్యాంగ డిజిటల్ వర్షన్ విడుదల

న్యూఢిల్లీ :నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి కీలక ప్రసంగం చేశారు. కార్యక్రమానికి హాజరైన వారితో భారత రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. తెలుగు, ఒడియా, అస్సామీస్, కాశ్మీరీ, బోడో, పంజాబీ, నేపాలీ, మరాఠీ, మళయాలం భాషల్లో ప్రచురించిన భారత రాజ్యాంగ గ్రంథం డిజిటల్ వర్షన్‌లను ఈ సందర్భంగా రాష్ట్రపతి విడుదల చేశారు. భారత్ కే సంవిధాన్ మే కళా ఔర్ కాలిగ్రఫీ శీర్షికతో ఒక స్మారక బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు.

-మిగతా 2 లో



## ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నాడా?

- జైల్లో మృతి చెందినట్టు వార్తలతో కలకలం
- చూపించాలంటూ మద్దతుదారుల ఆందోళనలు
- ఆయన్ను కలవడానికి వచ్చిన కుటుంబసభ్యులపై ఖాకీ జులుం

ఇస్లామాబాద్ :నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను చూపించాలంటూ ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కుటుంబ సభ్యులు సైతం ఆయన్ని కలవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసనలు కూడా చేపట్టినట్టు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం నడుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. దీనంతటికీ ఇమ్రాన్ ఖాన్ జైల్లో మృతి చెందారనే వార్తలు బయటకు రావడమే కారణమని తెలుస్తోంది. కాగా, 2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్ ఖాన్ అడియాలా జైలులో ఉన్నారు. అయితే, ఆయన్ను హతమార్చినట్టు సోషల్ మీడియాలో వార్తలు ప్రచారమయ్యాయి. దీనికి సంబంధించిన వార్తను బలూచిస్తాన్ విదేశాంగ శాఖ తమ ఎక్స్ ఖాతా లో పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ను హతమార్చినట్టు వార్తలు వస్తున్నా యని అందులో రాసుకొచ్చింది. ఇంకా పలు మీడి యా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్టు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. మరోవైపు ఆయన అనారోగ్యంతోనూ మరణించి ఉండొచ్చనే వాదనలు కూడా వినిపిస్తు న్నాయి. కానీ, ఇప్పటి వరకు వీటిని ధ్రువీకరించేలా అధికారికంగా ఒక్క ఆధారమూ బయటకు రాలేదు. ఈ వార్తల నేపథ్యంలో

-మిగతా 2 లో


## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### పారదర్శకంగా సర్పంచ్ ఎన్నికలు

- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు
- ఎస్ఈసీ రాణికుముదిని

హైదరాబాద్ నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె బుధవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, సీనియర్ అధికారులతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా

-మిగతా 2 లో





## రాజ్యాంగ విధులే ప్రజాస్వామ్యానికి పునాదులు

- రాజ్యాంగ దినోత్సవ వేళ ప్రజలకు మోడీ బహిరంగ లేఖ

న్యూఢిల్లీ నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
: పౌరుల రాజ్యాంగ విధులే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని ప్రధాని మోడీ అన్నారు. ఈ రాజ్యాంగ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని దేశ పౌరులకు ఆయన పిలుపు నిచ్చారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు సందేశమిస్తూ ప్రధాని మోడీ ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు.

-మిగతా 2 లో



## సంక్షోభాలను అధిగమిస్తేనే విజయాలు

- విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరగాలి
- ప్రతి పౌరుడూ విలువలు కాపాడాలి
- మాక్ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు

అమరావతి నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
సంక్షోభాలను అధిగమించగలిగితే విజయావకాశాలు పెరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విద్యార్థులు కూడా మంచి, చెడుపై ఆలోచించే శక్తిని పెంచుకోవాలన్నారు. సంవిధాన్ దివస్- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఎపి పాఠశాల శాసనసభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో నిర్వహించిన మాక్ డ్రిల్ను పరిశీలించారు. విద్యార్థులు నిర్వహించిన తీరును పరిశీలించిన ఆయన వారిని

-మిగతా 2 లో



## కీలక బిల్లులపై చర్చించేనా?

- డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు
- హడావిడిగా ఆమోదం పొందేందుకుమోడీ ప్రభుత్వ యత్నాలు

న్యూఢిల్లీ నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వచ్చే నెల 1వ తేదీన ప్రారంభం కాబోతున్నాయి. 19వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. సెలవలు పోను కేవలం పది హేను రోజులు మాత్రమే జరిగే ఈ సమావేశాలలో తొమ్మిది కీలక బిల్లులకు ఆమోదం పొందాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో అణు విద్యుత్, మార్కెట్లు, ఉన్నత విద్య, మౌలిక సదుపాయాలకు సంబంధించిన బిల్లులు ప్రధానమైనవి. స్టాక్ మార్కెట్, కార్పొరేట్ చట్టం, బీమాకు సంబంధించిన బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి. సమావేశాలు కేవలం పదిహేను రోజులు మాత్రమే జరుగుతుండడంతో ఇలాంటి ముఖ్యమైన బిల్లులపై చర్చకు పెద్దగా సమయం ఉండకపోవచ్చు. లోతైన చర్చకు అవకాశం ఇవ్వకుండానే వాటిని హడావిడిగా ఆమోదింపజేసుకోవడం ప్రభుత్వ ఉద్దేశంగా కన్పిస్తోంది.

-మిగతా 2 లో

## రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్

### రూ.50 వేల కోట్ల విద్యుత్ స్కాం

- ప్రయివేటీకరణ కోసమే కొత్త డిస్కం
- బీజేపీతో కాంగ్రెస్ కుమ్మక్కు..కాదంటే విచారణ జరపండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు




హైదరాబాద్ నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మొన్న దేశంలోనే పెద్ద భూకుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిందన్నారు. ఇప్పుడు రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణానికి రేవంత్ సర్కారు రూపకల్పన చేసిందని చెప్పారు. ఆధారాలతో సహా బయటపెడుతున్నామని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణంలో దాదాపు 30 నుంచి 40 శాతం కమీషన్లు దండుకోబోతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఏది మాట్లాడినా, ఏం చేసినా.. ఏది చెయ్యకున్నా దాని వెనుక ఒకే ఒక్క మిషన్

-మిగతా 2 లో

## దేశంలోనే అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్

నంబర్ ప్లేట్ కోసం రూ.1.17 కోట్లు!




2లో

# ఎయిరో స్పేస్..డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్

మొదటి తరువాయి

హబ్‌గా మారిందని చెప్పారు. బెంగుళూరు–హైదరాబాద్ నగరాలను డిఫెన్స్, ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఎయిరోస్పేస్ రంగంలో, ముఖ్యంగా వాటి నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ వంటి సదుపాయాలతోపాటు పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాఫ్రన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. తెలంగాణపై ఎంతో నమ్మకంతో సాఫ్రన్ గ్రూపు తన ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసులను అందించడంలో దేశంలోనే ఇది మొట్టమొదటి సెంటరని సీఎం వివరించారు. ఈ ఫెసిలిటీ సెంటర్‌తోపాటు సాఫ్రన్‌కు చెందిన ఎం–88 మిలటరీ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాల్‌కు శంకు స్థాపన చేయటం హర్షనీయమని అన్నారు. భారత వైమానిక దళం, నావికా దళానికి ఇది ఎంతో ఉపయోగపడుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాఫ్రన్ దాదాపు రూ.1,300 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణు లు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానిం చడంతోపాటు పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఎస్ఎంఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిల్లో ఒకటిగా నిలిచింద ని పేర్కొన్నారు. ఇక్కడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎయిరోస్పేస్ పార్కులు, ఎస్ఈజెడ్‌లు ప్రముఖ కంపెనీల నుంచి భారీ పెట్టుబడులను ఆకర్షించాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో గతేడాది ఎగుమతులు రెట్టింపయ్యాయని గుర్తుచేశారు. గత తొమ్మిది నెలల్లో ఎగుమతులు రూ.30 వేల కోట్లకు పైగా చేరుకుని, మొదటిసారి ఫార్మా ఎగుమతు లను అధిగమిం చాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో తెలంగాణ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును పొందిందని చెప్పారు.

రాష్ట్రంలో నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా విమానాల నిర్వహణకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే అంశంపై తమ ప్రభుత్వం దృష్టి పెడుతోందని సీఎం చెప్పారు. నైపుణ్యాలను మెరుగుపరచడానికి టాటా టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దామని వివరించారు. ప్రపంచ దేశాల్లోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడాలన్న సంకల్పంతో హైదరాబాద్ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వాని స్తున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. భారత లక్ష్యాలను చేరుకోవడంలో తెలంగాణ భాగస్వామిగా ఉండాలని ఆకాంక్షించారు. అదే క్రమంలో 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం వివరించారు. కార్యక్రమం లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాఫ్రన్ గ్రూప్ చైర్మన్ రాస్ మెకలెన్స్, సీఈఓ, డైరెక్టర్ ఒలివర్ అండ్రీస్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సీఈవో స్టీఫేన్ క్యూయెల్, జీఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ జీఎం రావుతోపాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ రియల్ ఎస్టేట్ కోసమే..జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం

మొదటి తరువాయి

లక్షల కోట్లను కొల్లగొట్టాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని, తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయంపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. బుధవారం వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ ఒక్క మున్సిపాలిటీలో తీర్మానం చేయకుండా, ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోకుండా, అఖిలపక్ష సమావేశం పెట్టకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల విలీన నిర్ణయం తీసుకున్నది. శాసనసభ సమావేశం పెట్టి, సభ్యుల అభిప్రాయం తీసుకోకుండా విలీనం చేయటం దుర్మార్గం' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి ఎజెండా కోసం విలీన నిర్ణయం తీసుకున్నారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

అవినీతి అనకొండ రేవంత్ రేవంత్‌రెడ్డి పాలనలో అవినీతి రాజ్యమేలుతున్నదని కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'హైదరాబాద్ భూములు తెలంగాణ ప్రజల సొత్తు. హైదరాబాద్ పారిశ్రామిక వాడలు తెలంగాణ ప్రజల నుంచి తీసుకున్న భూములు. వాటిని ప్రజల అవసరాల కోసం వినియోగించాలి.



హైదరాబాద్‌లో కాలుష్యకారక పరిశ్రమలను తరలించేందుకే కేసీఆర్ గతంలో ఫార్మాసిటీ నిర్ణయం తీసుకున్నారు. కొత్త టెక్నాలజీతో కాలుష్యం రాకుండా ఫార్మా కంపెనీలను తరలించి, ఇక్కడ ఉండే భూముల్లో 50 శాతం ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి అనేది మా ఆలోచన అయితే ఫ్యూచర్‌సిటీని రియల్‌ఎస్టేట్ పేరిట అమ్ముకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనగా మారింది. హైదరాబాద్‌లోని 9,300 ఎకరాలను అమ్మి, తెలంగాణను రాహుల్ గాంధీకి ఏటీఎం, పేటీఎంగా రేవంత్‌రెడ్డి మార్చారు. రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండగా అవతారం ఎత్తారు' ' అని కేటీఆర్ విమర్శించారు.

**రాహుల్ రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి**

బీసీలకు 42శాతం అమలు చేశామని గొప్పలు చెప్పుకున్న రాహుల్‌గాంధీ, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి తీరా 17 శాతం కూడా అమలు చేయని రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పార్టీ సింబల్ లేకుండా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొనడం దారుణమన్నారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన రాహుల్‌గాంధీ.. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశామంటూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణలోని బీసీ రిజర్వేషన్లను రేరా (రేవంత్ రాహుల్) మాడల్ అని చెప్పుకొని తిరిగి, ఇప్పుడు తడిగుడ్డతో బీసీల గొంతు కోశారని మండిపడ్డారు. బీసీలకు రేవంత్‌రెడ్డి కనీసం 17శాతం కూడా కల్పించడంలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల పట్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీసీ మేధావులు, బుద్ధిజీవులు, ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

# రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్

మొదటి తరువాయి

ఉంటుందనీ, అదే కమీషన్ అని అన్నారు. ఏ స్కీంను ఎలా పటిష్టంగా అమలు చేయాలి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి మంత్రివర్గం చర్చిస్తుందనీ, కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని మంత్రివర్గం స్కాంల గురించి ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ఓ దండుపాళ్యం బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలన సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటే, కాంగ్రెస్ పాలన బడా స్కాంలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని అన్నారు. వాటాలు, పంపకాల్లో తేడా రావడంతో మంత్రులే బయటకు వచ్చి ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటున్నారని గుర్తు చేశారు. హెచ్ఐఎల్‌టీపీ విధానం సీఎం ఒక్కరి నిర్ణయ ం కాదనీ, మంత్రివర్గ ఉపసంఘానిది అని మంత్రులు మాట్లాడారని అన్నారు. ఈ స్కాంలలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులందరికీ వాటా ఉందన్నారు.

**సర్కారు డ్రామా**

రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని హరీశ్‌రావు చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఎన్టీపీసీ, జెన్‌కోకు అవకాశం కల్పిస్తామనీ, ఏది తక్కువ వ్యయంతో నిర్మిస్తే దానికే అవకాశం ఇస్తామంటున్నారని అన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.12.23 కోట్ల ఖర్చు అవుతుందంటూ ఎన్టీపీసీ చెప్పిందన్నారు. అదే విధంగా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.14 కోట్లు ఖర్చవుతాయంటూ జెన్‌కో పేర్కొందని వివరించారు. ఎన్టీపీసీ, జెన్‌కో డీపీఆర్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక మెగావాట్ ఉత్పత్తికి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.8.63 కోట్లు, భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో రూ.9.74 కోట్లు, ఎన్టీపీసీలో రూ.12.23 కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. కమీషన్లు దండుకోవడానికి జెన్‌కోకు రూ.14 కోట్లకు ఖరారు చేసే అవకాశముందన్నారు. ఒక్కో మెగావాట్‌కు రూ.5,600 కోట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. రామగుండంలో ప్రాజెక్టు వ్యయం రూ.10,880 కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పెరుగుతుందని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో రూ.నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎన్టీపీసీ 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిందని గుర్తు చేశారు. ఇంకా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. దాని ఉత్పత్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేయొచ్చని అన్నారు. రేవంత్‌రెడ్డి అపరిచితుడు, చంద్రముఖిలా మారిపోతున్నారని చెప్పారు.

# సంక్షోభాలను అధిగమిస్తేనే విజయాలు

మొదటి తరువాయి

అభినందించారు. తడబాటు లేకుండా మాట్లాడిన తీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఏ పనైనా శ్రద్ధగా చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని, తాను కూడా చిన్నప్పట్నుంచి అదే అలవరచుకున్నానని వివరించారు. తనను లెక్చరర్ కావాలని తాను చదివిన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సూచిస్తే రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణతోనే 30 ఏళ్లకే మంత్రిగా, 45 ఏళ్లకే ముఖ్యమంత్రిగా ఎదిగానని చెప్పారు. భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, ప్రజలకు లభించిన ఆయుధం రాజ్యాంగమని వ్యాఖ్యానించారు. ఓటు వజ్రాయుధం వంటిదని, దానిని అంతా ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఇప్పుడు మాక్ డ్రిల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ వచ్చే ఎన్నికల నాటికి ఓటుహక్కు వస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మాక్ డ్రిల్లో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది మహిళలు ఉండటం సంతోషంగా ఉందని, చట్టసభల్లో కూడా 33 శాతం మంది మహిళలకు రిజర్వేషన్ కల్పించిన దేశం ఒక్క భారతేనని గుర్తుచేశారు.

**సాధారణ వ్యక్తులే గొప్పోళ్లు**

దేశంలో సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే ఇప్పుడు గొప్ప స్థానాల్లో ఉన్నారని చంద్రబాబు అన్నారు. చాయ్వాలా స్థాయి నుంచి నరేంద్ర మోడీ దేశానికి ప్రధాని అయ్యారని, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అబ్దుల్ కలామ్ రాష్ట్రపతిగా ఎదిగారని, గిరిజన మహిళ ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అయ్యారని, తాను కూడా సాధారణ కుటుంబం నుంచే నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యానని గుర్తు చేశారు. అందుకే ఇక్కడున్న వారంతా ఆ స్థాయికి ఎదిగేలా ప్రయత్నించాలన్నారు. రాజ్యాగం కొన్ని హక్కులు, బాధ్యతలను ఇచ్చిందని, అయితే కొంతమంది బాధ్యతలను విస్మరించి కేవలం హక్కుల కోసమే పోరాడతారని పేర్కొన్నారు. ఇది సరికాదని తెలిపారు.

# దేశంలోనే అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్

## నంబర్ ప్లేట్ కోసం రూ.1.17 కోట్లు!

న్యూఢిల్లీ

కారు రిజిస్ట్రేషన్ నంబర్ హెచ్‌ఆర్88బీ8888 సరికొత్త రికార్డు సృష్టించింది. బుధవారం జరిగిన వేలంలో దీనికి రూ.1.17 కోట్లు పలికింది. మన దేశంలో అత్యంత ఖరీదైన కార్ నంబర్ ప్లేట్‌గా ఘనతను సొంతం చేసుకుంది. హర్యానా




ప్రభుత్వం వీఐపీ లేదా ఫ్యాన్సీ వెహికిల్ రిజిస్ట్రేషన్ ప్లేట్స్‌ను ఆన్‌లైన్‌లో వేలం వేస్తూ ఉంటుంది.అదేవిధంగా శుక్రవారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నిర్వహించిన వేలంలో ఈ నంబర్ ప్లేట్‌కు 45 బిడ్స్ వచ్చాయి. ఈ ప్లేట్‌లోని ఇంగ్లిష్ అక్షరం బీ, అంకె 8 ఒకే విధంగా ఉండటం వల్ల ఎక్కువ మందిని ఆకర్షించింది. బేస్ ప్రైస్ రూ.50,000 నుంచి ప్రారంభమైంది. బుధవారం మధ్యాహ్నానికి రూ.88 లక్షలకు చేరింది. చివరికి వేలం ముగిసే సమయానికి రూ.1.17 కోట్లకు చేరింది.

# ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

మొదటి తరువాయి

**రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట**

ప్రజల స్వాభి మానాన్ని కాపాడే ఎన్నో హక్కులను రాజ్యాంగం దేశ ప్రజలకు ఇచ్చిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగమే మార్గదర్శి అని ఆమె స్పష్టం చేశారు. శాసనాల్లో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నామన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, అందులో భాగంగానే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తీసుకొచ్చినట్టు రాష్ట్రపతి చెప్పారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని, ఆర్థిక ఏకీకరణలో భాగంగా జీఎస్టీ వ్యవస్థను తీసుకొచ్చామని అన్నారు.

**జాతీయతావాదం దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం**

వలసవాద మనస్తత్వాన్ని త్యజించి, జాతీయతావాద ఆలోచనా వైఖరి దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం రాజ్యాంగం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహిళలు, యువత, ఎస్సీలు, ఎస్టీలు, రైతులు, మధ్యతరగతి, కొత్తగా మధ్యతరగతిలో చేరుతున్న వారు భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి తెలిపారు. ఇటీవలి కాలంలో 25 కోట్ల మంది భారతీయులను దారిద్ర్య రేఖ నుంచి బయటికి తీసుకురావడం అనేది భారతదేశ గొప్ప విజయమని ఆమె కొనియాడారు.

# ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నాడా?

మొదటి తరువాయి

ఇమ్రాన్ ఖాన్ సోదరీమణులు మంగళ వారం రాత్రి జైలు వద్దకు చేరుకోగా..తమ సోదరుణ్ని కలిసేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అందుకు అనుమతించలేదని, పైగా వారిపై తీవ్రంగా దాడి కూడా చేసినట్టు తెలు స్తోంది. దీంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు చేస్తున్నట్టు సమాచారం.

# రాజ్యాంగ విధులే ప్రజాస్వామ్యానికి పునాదులు

మొదటి తరువాయి

ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. బాధ్యతలను నిర్వర్తించే వైఖరి నుంచే హక్కుల ప్రవాహం జరుగుతుందని మహాత్మా గాంధీ విశ్వసించారని తెలిపారు. ప్రజలంతా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తేనే సామాజిక, ఆర్థిక వికాసానికి పునాదులు పడతాయని భారత జాతిపిత చెప్పేవారని గుర్తుచేశారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, బీఆర్ అంబేద్కర్ వంటి ఎంతోమంది మహానుభావులు భారత రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించారని మోడీ కొనియాడారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

మొదటి తరువాయి

ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సుల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల వారీగా కేటాయించాలని సూచించారు. నేటి నుంచి ప్రారంభం కానున్న మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. నోటీసు జారీ, రిటర్నింగ్ అధికారిచే వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శనలో వివాదాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో ఉపేక్షించరాదనీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికలు, సజావుగా, స్వేచ్ఛగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**

సర్పంచ్ ఎన్నికల మొదటి విడతకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఉదయం గ్రామ పోలింగ్ అధికారి ఎన్నికల నోటీసు జారీ చేసిన తర్వాత వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు జరగనున్నాయి.

**ఎన్నికల ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ మాడ్యూల్ ఏర్పాటు**

గ్రామ పంచాయతీ ఎన్నికల ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ మాడ్యూల్ అప్లికేషన్ ఏర్పాటు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. పౌర సమాజం తమ యొక్క ఫిర్యాదులను ఈ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసి, వాటి పరిష్కార ప్రగతిని ట్రాక్ చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ఈ అప్లికేషన్‌లో తమ మొబైల్ నెంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకుని తర్వాత ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. పౌరుల్లో భాద్యతా భావాన్ని పెంచి, ప్రజాస్వామ్యాన్ని పెంచడంలో ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

# కీలక బిల్లులపై చర్చించేనా?

మొదటి తరువాయి

ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లుల్లో అత్యంత కీలకమైనది అణు విద్యుత్ రంగానికి సంబంధించింది. ఇది రాజకీయంగా సున్నితమైన ప్రతిపాదన. అణు విద్యుత్ రంగాన్ని ప్రయువేటు శక్తులకు కట్టబెట్టడం దీని ఉద్దేశం. పది సంవత్సరాల క్రితం ఇది ఊహకు సైతం రాని ప్రతిపాదన. దేశంలోని అత్యంత శక్తివంతమైన ఆరు కార్పొరేట్ గ్రూపులు అదానీ, అంబానీ, టాటాలు, వేదాంత, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, నవీన్ జిందాల్‌కు చెందిన జిందాల్ ఎనర్జీ ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగల్ వచ్చిన మరుక్షణమే అణు రంగంలోకి ప్రవేశించాలని తహతహలాడుతున్నాయి. అయితే వారి భాగస్వామ్యం చిన్న చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్లకు ఆర్థిక సాయం అందించడం, వాటిని నిర్మించడం వరకే పరిమితం. సంప్రదాయ అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలంటే అనేక బిలియన్ డాలర్లు ఖర్చవుతాయి. అంతేకాక వాటి నిర్మాణానికి దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలమే పడుతుంది. అణు విద్యుత్ రంగాన్ని ప్రయువేటు సంస్థలకు అప్పగించడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు సంస్థలు ఎప్పుడూ దీర్ఘకాలిక భద్రత, విశ్వసనీయతపై కంటే లాభాల పైనే దృష్టి పెడతాయని వారు గుర్తు చేశారు.

# ఘనంగా 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**దేవరకొండ, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

దేవరకొండ స్థానిక బస్టాండ్ సెంటర్లో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు నేతృత్వంలో ప్రపంచ మేధావి, విశ్వ మానవుడు, భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర ఆంజనేయులు మాట్లాడుతూ, నవంబర్ 26, 1949న అంబేద్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ రాజ్యాంగాన్ని పూర్తిచేసి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు అందజేసిన రోజునే రాజ్యాంగ దినోత్సవంగా జరుపుతున్నామని గుర్తు చేశారు. 1950 జనవరి 26న రాజ్యాంగం



అమలులోకి వచ్చి భారతదేశాన్ని సర్వభౌమ, సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా నిలబెట్టిందని వివరించారు. రాజ్యాంగ రచనకు డాక్టర్ అంబేద్కర్ రెండు సంవత్సరాలు, 11 నెలలు, 18 రోజులు కృషి చేశారని, అందులోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు ప్రజలకు రక్షణ కవచాలుగా ఉన్నాయని తెలిపారు. రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, మహిళా హక్కులు, సమానత్వం సాధ్యమైందని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి పల్లెలో, ప్రతి గూడెంలో రాజ్యాంగ హక్కులను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ సెక్రటరీ సుక్క ముత్తయ్య, పీఏ పల్లి మండల అధ్యక్షుడు దున్న ముత్యాలు, గుడిపల్లి మండల అధ్యక్షుడు బోడ నాగరాజు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# తాటిపాములలో రాజ్యాంగ దినోత్సవం



**వనపర్తి, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తాటిపాముల గ్రామంలో 76వ భారత రాజ్యాంగ దినోత్సవం, జాతీయ న్యాయదినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1949 నవంబర్ 26న అంబేద్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ రాజ్యాంగాన్ని పూర్తిచేసి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు అందజేసిన రోజునే రాజ్యాంగ దినోత్సవంగా జరుపుతున్నామని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని మౌలిక విలువలను ప్రతి పౌరుడు కాపాడాలని, సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛను నిలబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటయ్య నాయుడు, రాజా గౌడ్, మాజీ సర్పంచ్ బజారయ్య, కురుమూర్తి, సుధాకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం.

### ఎమ్మార్పీఎస్ చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు.



**దేవరకొండ,నవంబర్ 26. (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు అన్నారు.

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 76సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేవరకొండలో బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అందుగుల సైదులు మాట్లాడుతూ.. దేశంలోని సబ్బండ వర్గాల ప్రజలకు స్వేచ్ఛ,స్వాతంత్ర్యం, హక్కులను కల్పించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనికొనియాడారు. రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు ప్రతీ ఒక్కరు ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు ,కొమ్ము ఉదయ్ కుమార్, చాట్ల ప్రశాంత్ ,కుక్కల మల్లయ్య, ఎలిమినేటి ఈశ్వర్, దర్శనం శివ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**అచ్చంపేట, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అచ్చంపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రూపొందిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు జరిగాయి.

ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర నాయకుడు ఏ. అనీల్ మాట్లాడుతూ, కొంతమంది శక్తులు రాజ్యాంగంపై కుట్రలు చేస్తున్నారని, అది సరైనది కాదని అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారమే దేశ వ్యవస్థ నడుస్తుందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుంద మల్లికార్జున్, ఖాసిం, రాజ్ గోపాల్, సుధాకర్, బాలరాజు, ఆనంద్, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మిరాసిపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో గ్యాస్ స్టౌ ప్రారంభం



**వనపర్తి, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: మిరాసిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజన వంటకాలకు ప్రభుత్వం శాంక్షన్ చేసిన గ్యాస్ సిలిండర్ స్టౌను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ఇకపై మిరాసిపల్లి ఉన్నత పాఠశాలలో శుచిగా, రుచికరంగా, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. వంట కార్మికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మిద్దె సత్యనారాయణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీంపల్లి బాలరాజు, ఉపాధ్యాయులు ఎం. విష్ణువర్ధన్, కే. బుచ్చాచారి, జి. సురేష్, రాజారెడ్డి, బి. శ్వేతా, వంట కార్మికులు మొగులమ్మ, బాలమ్మలు పాల్గొన్నారు.


# సూరి ఆర్ట్స్ షాప్ ను ప్రారంభించిన నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ,నవంబర్ 26. (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

దేవరకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సూరి ఆర్ట్స్ షాప్ ను నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరి ఆర్ట్స్ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ,యువత స్వయం శక్తితో ఎదగాలని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సూరి ఆర్ట్స్ షాప్ యజమాన్యం సన్మానించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# సైనిక్‌పురి వినోభా నగర్‌లో ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణం





**సైనిక్‌పురి, నవంబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

సైనిక్‌పురి వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుకల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు తిరుకల్యాణ విశిష్టతను, ధనుర్మాస ప్రశస్త్యాన్ని భక్తులకు వివరించి ఆధ్యాత్మికతను చాటారు. కార్యక్రమానికి పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు మరియు భక్తులు హాజరై, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆశీస్సులు పొందారు. వేడుక అనంతరం దేవస్థాన పాలక మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ మహోత్సవంలో 300 మందికి పైగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ విధంగా తిరుకల్యాణ మహోత్సవం భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# సాహితీ వేత్తలకు కురుమూర్తి దేవస్థానంలో ఘన సన్మానం



**వనపర్తి, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వనపర్తి వాస్తవ్యులు సాహిత్య, కళా రంగాలలో ప్రతిభ కనబరచిన వారిని ఆదివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కురుమూర్తి దేవస్థానంలో ఘనంగా సన్మానించారు. సాహిత్య సాంస్కృతిక సామాజిక రంగాలలో విశేష సేవలందిస్తున్న సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, సాహితీవేత్త, వ్యాఖ్యాత, ప్రసిద్ధ శిల్పి బైరోజు చంద్రశేఖర్, తెలుగు భాషోపాధ్యాయులు సాహితీవేత్తలు శ్రీమతి చెన్న పద్మ, శ్రీమతి సువర్ణాదేవి, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి కుమారి చైత్రారెడ్డి పక్షాన ఆమె తండ్రి పవన్ కుమార్‌లను ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మదనేశ్వర్ రెడ్డి, కళాకారులు బెల్లం సాయిలు, బెకెం జనార్ధన్, మాదం వెంకటేష్, ఆలయ కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాల సందర్భంగా కళా రంగంలో కృషి చేసిన వారిని సన్మానించడం ఆనవాయితీగా కొనసాగుతున్నదని తెలిపారు. వనపర్తి కళాకారులను సన్మానించడం పట్ల సాహితీవేత్తలు కందూరు నారాయణ రెడ్డి, సందాపురం బిచ్చయ్య, కొత్తకాపు నారాయణ రెడ్డి, బండారు శ్రీనివాస్, డా. నరేష్ కుమార్, డా. బి. శ్యాం సుందర్, తిరుమలేశ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# అప్పరాజు పల్లిలో న్యాయ చైతన్య సదస్సు




**మహబూబాబాద్, నవంబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అప్పరాజు పల్లిలో బుధవారం ఋణమార్పిడి పథకం పై అవగాహన సమావేశం జరిగింది. రైతుల్లో పెరుగుతున్న రుణభారం, అధిక వడ్డీ రుణాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు చెందిన మధ్యవర్తి చెన్నామల్లారెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజు కృష్ణ పాల్గొన్నారు. రైతులకు రుణమార్పిడి పథకం ప్రయోజనాలు, న్యాయపరమైన రక్షణ, చట్టబద్ధమైన మార్గాలు గురించి వివరించారు. సదస్సులో పాల్గొన్న రైతులు తమ సమస్యలను వివరించగా, న్యాయవాదులు వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో న్యాయ అవగాహన పెంపొందించడమే కాకుండా, రుణభారం తగ్గించుకునే మార్గాలపై స్పష్టత కలిగించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# అమ్రాబాద్ కు కొత్త నాయబ్ తాసిల్దార్



**అమ్రాబాద్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలానికి కొత్త నాయబ్ తాసిల్దార్‌గా నేనవత్ రాములు బాధ్యతలు స్వీకరించారు. గతంలో నాగర్‌కర్నూల్ మండలంలో ఎలక్షన్ డీటీగా పనిచేశారు. అమరాబాదులో డిప్యూటీ తాసిల్దార్‌గా ఉన్న అబ్దుల్ రావుఫ్ చారగొండకు బదిలీపై వెళ్లారు.

# కరెంట్ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణంలోని మదీనా మస్జిద్ ప్రాంతంలో 20 సంవత్సరాలుగా పాడై ఉన్న ట్రాన్స్ఫార్మర్ సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ 24 గంటల్లోనే పరిష్కరించారు. కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో కాలనీ వాసుల సమస్య తీరింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ఇంతకాలం ఎవరూ స్పందించని సమస్యను ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించారని, ఆయనకు మరియు విద్యుత్ శాఖ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ రఫీ, మున్సిపాలిటీ కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్, ఎమ్మెల్యే పీఏ సోహెబ్, మైనారిటీ నాయకులు షఫీ, మంజూర్, గౌస్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# సేవలో అగ్రగామి వాసవి క్లబ్

**- రూ.50 లక్షల స్థలం విరాళం**





**షాద్‌నగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ గుడ్‌విల్ విజిట్‌లో భాగంగా పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. భగవద్గీత పారాయణ కమిటీకి దాతలు ఎలుకుర్తి నారాయణ, శ్రీనివాస్ రూ.50 లక్షల విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చి, రిజిస్ట్రేషన్ పత్రాలను అధ్యక్షుల చేతుల మీదుగా అందజేశారు. పారాయణ భవన్ నిర్మాణానికి 20 శాతం నిధులు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బస్సు షెల్టర్లు, సిమెంట్ టేబుల్ వంటి సౌకర్యాలను ప్రారంభించారు. ఆర్థికంగా వెనుకబడిన యువతి వివాహానికి పుస్తెమెట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారాయణ కమిటీ సభ్యులు, వాసవి క్లబ్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణాలను కాపాడుతుంది



**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ కియా హాస్పిటల్‌లో ఒడిశాకు చెందిన నేహా అనే పేషంట్ పెద్దపల్లిలో కూలి పని చేస్తూ పై అంతస్తు నుండి జారి కాలు విరగడంతో ఆపరేషన్ కోసం అర్ధరాత్రి 11 గంటలకు బి పాజిటివ్ రక్తం అత్యవసరమైంది. సమాచారం అందుకున్న గాలిపెల్లి కుమార్ సహకారంతో రక్తదాత ఉదరి సంతోష్ ఒక్క ఫోన్ కాల్‌కే స్పందించి వెంటనే ఆయుష్ బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రాత్రి వేళలోనే రక్తదానం చేశాడు. “రక్తదానం ఒక చిన్న కార్యమే అయినా ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుంది”.

# కరీంనగర్ యువతకు స్ఫూర్తి

## వేగంగా ట్రెండ్‌లోకి వచ్చిన RK దోస” సెంటర్

జీవితంలో ఎదురైన విఫలాలను అవకాశాలుగా మలచుకోగలిగితే... విజయం తప్పకుండా మనదే! అనుకున్న ఉద్యోగం సాధ్యం కాకపోయినా, వెనుకడుగు వేయకుండా కొత్త దారులు అన్వేషించి విజయంపై చెరగని ముద్ర వేస్తున్న యువకుడు ు సంబోజి రాంకిషోర్. ఇది అతని పట్టుదల, పరాక్రమం, కొత్త ఆలోచనల ప్రయాణగాధ.

**ఉన్నత విద్య -ఉపాధ్యాయుడిగా సేవ**

MA ఇంగ్లీష్‌ను రెండుసార్లు పూర్తి చేసిన రాంకిషోర్ B.Ed కూడా చేశారు. 13 ఏళ్లపాటు కళాశాలల్లో లెక్చరర్‌గా సేవలందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగమే పరమావధిగా, అంకితభావంతో తయారీ చేశారు.

**ఒక్క మార్కు తేడా - కలల చెదిరిన క్షణం**

2025 డీఎస్సీ ఫలితాలు కేవలం 1 మార్కు తేడాతో కలల ఉద్యోగం చేజారింది.
అలాంటి దెబ్బ తీరిపోని దుఃఖమే. కానీ రాంకిషోర్ గారు “ఓటమి అనేది తాత్కాలికం మాత్రమే. లక్ష్యమే శాశ్వతం!” అని ధైర్యంగా నిలబడ్డారు.

**నిరుత్సాహం నుంచి నూతన ఆశల దారి**

**ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండానే,**

“మన జీవితానికి మనమే యజమానులు కావాలి. స్వయం ఉపాధే ఉత్తమ భవిష్యత్తు”
అని నమ్మి ఫుడ్ బిజినెస్ వైపు అడుగులు వేశారు. యువత అభిరుచులను, మార్కెట్ డిమాండ్‌ను కనుగొన్నారు.

**శిక్షణతో ప్రారంభమైన కొత్త ప్రయాణం**

ఒక్క నిర్ణయం... ఆ తర్వాత చిత్తశుద్ధి!
హైదరాబాద్‌లో 3 నెలల ప్రత్యేక శిక్షణ
ఆధునిక సదుపాయాలతో కొత్త ఫుడ్ ట్రక్ రూపకల్పన
ప్రత్యేక మెను, నాణ్యమైన తయారీ పద్ధతులు
ఇలా కరీంనగర్‌లో “RK దోస”







రూపుదిద్దుకుంది!

**నగరంలో రుచి లక్ష్యం- RK Dosa**

ప్రతిమ మల్టీప్లెక్స్ పక్కనే, కలెక్టరేట్ రోడ్, కరీంనగర్
ప్రతిరోజూ సాయంత్రం 5:30 – రాత్రి 11:00 వరకు
30+ రకాల ప్రత్యేక దోసలు

వివిధ రుచులు... విభిన్న స్టైళ్ళు
ప్రతి దోసలో నాణ్యత + రుచికర అనుభవం!

**యువతకు రాంకిషోర్ సందేశం**

“వైఫల్యం వచ్చినప్పుడు
ఆగిపోకండి – ఆలోచన మార్చండి.
స్వయం ఉపాధి – మన జీవితానికి నిజమైన భరోసా.”
ఇలాంటి ఆత్మవిశ్వాసమే నేటి తరానికి అత్యవసరం.

**ఆదర్శప్రాయ ఔత్సాహికుడిగా ఎదుగుతున్న రాంకిషోర్**

ఉపాధి కోసం అడబెట్టిన చేతిని,
స్వయం ఉపాధి మార్గంలో ధైర్యంగా ముందుకు తీసుకువెళ్లిన
ఆ చేతులే ఇప్పుడు పలువురికి ఉపాధి అవకాశాలకూ మార్గం చూపుతున్నాయి.

**పట్టుదలతో ఏ నిర్ణయం తీసుకున్నా... రుచి విజయం మనదే అవుతుంది అని నిరూపిస్తున్నాడు సంబోజి రాంకిషోర్!**

సేకరణ & కూర్పు
విజయప్రసాద్ నలుమాసు
కవి, తెలుగు బోధకులు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్పీ అభ్యర్థులను గెలిపించండి

## జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్



**నాగర్‌కర్నూలు, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ బోనాసి రాంచందర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా బిఎస్పీ శ్రేణులు సర్పంచ్, వార్డ్ మెంబర్ స్థానాలకు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలన బహుజనులకు ఓటు హక్కు, ఎన్నికల్లో నిలబడే హక్కులు లభించాయని గుర్తు చేశారు. ఎన్నికలు ఐదేళ్లకు ఒకసారి వస్తాయని, ఈ అవకాశాన్ని బిఎస్పీ యువత సద్వినియోగం చేసుకుని బరిలో నిలిచి గెలవాలని ఆకాంక్షించారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు భయపడి పోటీ చేయకుండా ఉండొద్దని, గెలిస్తే చరిత్ర, ఓడితే అనుభవం వస్తుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు బిఎస్పీ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేస్తూ, ప్రజా సమస్యల కోసం బిఎస్పీ నిరంతరం పోరాడుతుందని, కులం, మతం, ప్రాంతం వంటి బేధాలు లేవని స్పష్టం చేశారు. న్యాయం వైపు నిలిచి, న్యాయం కోసం బిఎస్పీ పార్టీ పాటుపడుతుందని తెలిపారు. అందుకే బిఎస్పీ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జోనల్ ఇంచార్జ్ పృథ్వీరాజ్, జిల్లా ఇంచార్జ్ సి. కళ్యాణ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్ష ముదిరాజ్, అసెంబ్లీ ఇంచార్జ్ కూసునూర్ శ్రీను, అసెంబ్లీ అధ్యక్షుడు మడుపు నాగేష్, ఈసీ మెంబర్ నాగరాజు, తెల్కపల్లి మండల అధ్యక్షులు బాలనాగులు, మధు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం

**ఓటర్లను మచ్చిక చేసుకుంటున్న ఆశావాహులు.**
**అవకాశం కల్పించాలని పార్టీ నేతలపై ఒత్తిడి.**




**ఎలిగేడు, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామపంచాయతీ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి రాజుకుంటుంది. రిజర్వేషన్ ఖరారు కావడంతో పదవులను ఆశించే ఆశావాహులు గ్రామాల్లో ఓటర్లను కలుస్తూ మచ్చిక చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నం మొదలుపెట్టారు. పదవులను ఆశించే వారి సంఖ్య పెరుగతుండడంతో తమకే అవకాశం కల్పించాలని అన్ని పార్టీల అధి నాయకుల చుట్టూ తిరుగుతూ ఒత్తిడి తీసుకువస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించామని ప్రకటించి గత నెలలో పంచాయతీ ఎన్నికలకు సిద్ధమై రిజర్వేషన్లు ఖరారు చేశారు . కోర్టు జోక్యంతో పాత 50% రిజర్వేషన్ ప్రకారం ప్రస్తుత ఎన్నికలు చేపట్టడంతో రిజర్వేషన్లు మారిపోయాయి. దీంతో బిసి వర్గాల్లో కొంచెం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రిజర్వేషన్ల ప్రకారం పోటీలో నిలబడే నాయకులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు ఎవరికి అవకాశం దక్కుతుందో ఎవరు విజయం సాధిస్తారో డిసెంబర్ 17వ తేదీన తేలనున్నది.

నీలగిరి ఎక్స్‌ప్రెస్

గురువారం 27 నవంబర్ 2025

# గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ దిశానిర్దేశం




**నాగర్‌కర్నూలు, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూలు జిల్లాలో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్, అదనపు కలెక్టర్ దేవసహాయం లతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 1977 ఎన్నికల యాక్ట్ ప్రకారం మొదటి 24, 48, 72 గంటల్లో అమలు చేయాల్సిన నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయని, మొదటి విడతలో కల్వకుర్తి, ఊర్కోండ, వెల్దండ, వంగూరు, తాడూరు, తెలకపల్లి మండలాల్లోని 151 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలలోపు ఫార్మా-1 ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి సంబంధిత కార్యాలయాల్లో అతికించాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ నవంబర్ 27న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, చివరి తేదీ నవంబర్ 29 సాయంత్రం 5 గంటలని తెలిపారు. నవంబర్ 30న పరిశీలన, డిసెంబర్ 1న అప్పీలు, డిసెంబర్ 3న మధ్యాహ్నం 3 గంటలలోపు ఉపసంహరణ ఉంటుందని వివరించారు. మొదటి విడత ఎన్నికలు డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్నాయని, అదేరోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. ప్రచారం ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అనుమతిస్తారని, లౌడ్‌స్పీకర్లు మాత్రం ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు మాత్రమే అనుమతిస్తారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా ఎంపీడీఓలు ముందుగానే పరిశీలించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ మాట్లాడుతూ, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచామని, నామినేషన్ కేంద్రంలో వంద మీటర్ల లోపు ఎవరినీ అనుమతించబోమని, అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి పోలీస్ భద్రత కల్పించి ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు శ్రీరాములు, గోపాల్, సంధ్యారాణి, రమేష్ కుమార్, రాజ్ కుమార్, చిన్న బాలు నాయక్, రాజేశ్వరి, సీతారాం నాయక్, రాజేందర్ సింగ్, నాగేందర్, యాదగిరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**హైదరాబాద్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ రిజర్వేషన్లను ప్రకటిస్తూ బీసీలకు కేటాయింపులు కేవలం 2,176 పంచాయతీలకే పరిమితం కావడం తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఇది రిజర్వేషన్ కాదు, బీసీలపై బహిరంగ దాడి అని టి ఆర్ పి రాష్ట్ర యువ నాయకుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ మండిపడ్డారు. "42 శాతం ఇస్తానని హామీ ఇచ్చి 17 శాతం మాత్రమే ఇచ్చే ప్రభుత్వం, ఇది పాలన కాదు, బీసీల భవిష్యత్తుపై పాతుకుపోయిన కత్తి. బీసీ ఓట్లతో గెలిచి బీసీలకే ద్రోహం చేసిన ప్రభుత్వం ఇదే" అని ఆయన ఘాటుగా విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన వెంటనే రిజర్వేషన్ల కత్తిరింపుతో తమ అసలు రాజకీయ కుట్రలను బయటపెట్టారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే శాసనమండలిలో "42 శాతం రిజర్వేషన్ అన్నది రెడ్ల పెద్ద డ్రామా, బీసీలను మోసం చేసే కుట్ర" అని చెప్పిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాటలు నేటి నిర్ణయంతో నిజమని రుజువైందని చంద్రశేఖర్ గుర్తుచేశారు. "బీసీలను అణగదొక్కే ఈ రెడ్డి సర్కార్‌కు గుణపాఠం చెబితే అది ఇప్పుడు మాత్రమే. ప్రతి బీసీ లేచి నిలబడాలి. బీసీ హక్కుల మీద కత్తి దించితే మేము కత్తి తీసి పోరాడతాం" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీసీల హక్కులను దోచుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఊరిలో, ప్రతి బస్టాండ్‌లో, ప్రతి ఇంటి ముందూ బీసీలు సమాధానం చెప్పాలి. బీసీలు ఐక్యమైతే ఈ ద్రోహ ప్రభుత్వం ఒక్క రోజూ నిలబడదు. అగ్రకులాల రాజకీయ పార్టీలను బొంద పెట్టాలి" అని బొడ్డుపల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

## ఏసి టెక్నీషియన్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం, విలియం కేరిస్ జయంతి




**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** జిల్లా ఏసి రిఫ్రిజియేషన్ మరియు వాషింగ్ మిషన్ టెక్నీషియన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం, ఏసి సృష్టికర్త విలియం కేరిస్ జయంతి వేడుకలు టిఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. న్యాయవాది, యూనియన్ లీగల్ అడ్వైజర్ బీమా సాహెబ్ ముఖ్య అతిథిగా హాజరై టెక్నీషియన్లు ఏకతా వేదికపై ఉండడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు సభ్యత్వం ప్రయోజనాలను వివరించారు. సీనియర్ టెక్నీషియన్లను సన్మానించి, కేక్ కట్ చేసి, సివిల్ హాస్పిటల్‌లో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకలో అధ్యక్షుడు గొల్లపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎండి ఖలీల్, కోశాధికారి కొండమీద తిరుపతి, ఉపాధ్యక్షులు జావిద్ పాషా, ప్రశాంత్ కుమార్, కార్యదర్శి మహమ్మద్ రఫీక్ హైమద్, సహాయ కార్యదర్శులు ఏవి బాబా, తాజ్ బాబా, సీనియర్ సభ్యులు ఆయుబ్ ఖాన్, చింతల సాంబయ్య, తాజుద్దీన్, ఇమ్రాన్ ఖాన్, శ్రీకాంత్, మహేందర్‌తో పాటు వందమంది టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం




**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి భారత రాజ్యాంగం ప్రపంచంలో గొప్పదని, ప్రజల సంక్షేమానికి దిశానిర్దేశం చేస్తుందని అన్నారు. ప్రారంభానికి ముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించారు. రాజ్యాంగం ప్రజలకు కనీస అవసరాలను కల్పించడంలో కీలకమని, ప్రభుత్వాలు దానిని అమలు చేసి ప్రజల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులు రాజ్యాంగ ప్రాధాన్యతపై నాటికలు ప్రదర్శించి సందేశాత్మకంగా ఆలోచింపజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాదయాత్రతో శబరిమలై సన్నిధానానికి చేరిన అయ్యప్ప భక్తుడు



**ఎలిగేడు, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన బుర్ర అజయ్ గౌడ్ గత నెలలో అయ్యప్ప మాల ధరించి పాదయాత్రతో శబరిమలై బయలుదేరారు. అయ్యప్ప కరుణ కటాక్షంతో 48 రోజుల పాటు 1550 కిలోమీటర్ల పాదయాత్ర చేసి నేడు అయ్యప్ప సన్నిధానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం తన జన్మ సుకృతమని భావిస్తున్నానని తెలిపారు. అనంతరం అయ్యప్ప సన్నిధానం మేల్ శాంతి ఆశీర్వచనం పొందినట్లు పేర్కొన్నారు.

## పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం




**నిజాంపేట్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ బాలాజీ హిల్స్ కాలనీ, ఇందిరమ్మ ఫేజ్-2లోని శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ లలిత త్రిపుర సుందరీ సమేత మహా మృత్యుంజయేశ్వర (మరకత లింగం), నందీశ్వర, సుబ్రహ్మణ్యస్వామి ప్రతిష్ఠా కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. మహోత్సవంలో మాజీ మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, నర్సారెడ్డి వీరారెడ్డి, ఆలయ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, సుదర్శన్ రెడ్డి, జూలకంటి లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** శుభాష్‌నగర్ డివిజన్ అపురూప కాలనీలోని జనాప్రియ అపార్ట్మెంట్‌లో శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. పూజలో అయ్యప్ప స్వాములు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఆశా నగర్‌లో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి వేడుకలు



**అల్విన్ కాలనీ, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆశా నగర్‌లో శ్రీ రామలింగేశ్వర స్వామి సహిత అభయాంజనేయ స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, నరసింహులు, సూరిబాబు, లక్ష్మణ్, రాజు గౌడ్, మాణిశ్వరరావు, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## నూతనోత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ స్పోర్ట్స్ మస్త్




**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో స్పోర్ట్స్ మస్త్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణం, భగత్‌నగర్ అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకకు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి అని, వాటి ద్వారా ఒత్తిడి తగ్గి విజయాలు సాధించడం సులభమవుతుందని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖో-ఖో, కబడ్డి, హ్యాండ్బాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ప్రారంభోత్సవంలో క్రీడా జ్యోతిని వెలిగించి విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు. ఈ వేడుకలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభం



**జగద్గిరిగుట్ట,నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ పథకం కింద జగద్గిరిగుట్ట 126వ డివిజన్‌లో లబ్ధిదారు ఉమ ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను గాజులరామారం సర్కిల్ కమిషనర్ మల్లరెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు స్వంత వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా స్వతంత్రంగా మారేందుకు ఈ పథకం తోడ్పడుతుందని, మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకాలలో ఇది ఒకటని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అవిజె జేమ్స్, సంజీవ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సోమన్నా గారి శ్రీధర్ రెడ్డి, గణేష్, రవీందర్, శ్రీనివాస్ చారి, కయ్యుమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మూడో వార్డు సమస్యలపై కమిషనర్‌కు మెమొరాండం




**ఆమనగల్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్ మున్సిపాలిటీ మూడో వార్డు సాకిబండతాండ, నుచ్చుగుట్ట తండా, ఎర్రబీక్యతాండ సమస్యలను పరిష్కరించాలని యువ నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీలు, వీధిలైట్లు, చెట్ల నరికివేత, శానిటైజేషన్, బజార్ల పరిశుభ్రత, తడి పొడి చెత్త బండిని ప్రతిరోజు ఉదయం పంపిణీ చేయాలని కోరారు. కమిషనర్ వెంటనే పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో రవి రాథోడ్, సత్య నాయక్, రమేష్ నాయక్, బాలు, భాస్కర్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

# బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6వ ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**కుత్బుల్లాపూర్,నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129వ డివిజన్ న్యూ శివాలయ నగర్‌లో బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, యువ కాంగ్రెస్ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పేద మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందం శిబిరాన్ని నిర్వహించగా, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరుష శైలం యాదవ్, నరసింహారెడ్డి, సాదు యాదవ్, గజ జగన్, ముదిరాజ్, రచ్చ నాయక్, యూత్ అధ్యక్షులు మౌనిష్ యాదవ్, శివతేజ, సందీప్ రెడ్డి, నాని, నరేష్, మహేష్, సమీర్, హరీష్, హరిదాస్, వెంకన్న, శ్రీనివాస్ మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్): కరీంనగర్ గ్రామీణ మండలం చెర్లబుత్కూర్ గ్రామంలోని ఒక వ్యవసాయ బావిలో గుర్తుతెలియని పురుషుని మృతదేహం లభ్యమైంది. వయసు సుమారు 40-45 సంవత్సరాలు. పూర్తి చేతుల చొక్కా, బెల్ట్‌తో బ్యాగీ ప్యాంట్, హిల్సన్ గమ్‌బూట్స్ ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తుపట్టగలిగితే లేదా సమాచారం ఉంటే వెంటనే కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని అధికారులు కోరారు. సంప్రక్షణ కోసం ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి (87126 70764), సబ్‌ఇన్‌స్పెక్టర్లు టి. నరేష్ (87125 74753), ఎ. లక్ష్మారెడ్డి (90008 84443)లను సంప్రదించవచ్చు.

# సర్పంచ్ రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం



**పెద్దపల్లి, నవంబర్ 26 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 17 శాతం బీసీ రిజర్వేషన్లు మోసమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్ తీవ్రంగా విమర్శించారు. మొత్తం 12,375 గ్రామాల్లో కేవలం 2,176 గ్రామాలు మాత్రమే బీసీలకు కేటాయించడం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల అహంకారంతో వ్యవహరించారని, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఎమ్మెల్యేలు వెంటనే పదవులకు రాజీనామా చేసి బీసీలకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. నల్లగొండలో బీసీ నేతను డీసీసీ అధ్యక్షుడిగా ప్రకటించడాన్ని అడ్డుకున్న కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చర్యను కుల రాజకీయాల పరాకాష్టగా అభివర్ణించారు. బీసీలు ఏకమై ఈ ప్రభుత్వాన్ని ఓడించి బీసీ రాజ్యాధికారాన్ని స్థాపించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే బీసీ అభ్యర్థులకు టీ ఆర్ పి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# బీసీల ప్రయోజనాలను బలి చేయొద్దు




**పెద్దపల్లి, నవంబర్ 26( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తీవ్రంగా విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట జీవో 46 ప్రతులను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేసిందని ఆరోపించారు. జీవో 9ని రద్దు చేసి జీవో 46ను తీసుకురావడం బీసీల ప్రయోజనాలను బలి చేయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, షాపుల బంద్ చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, అందువల్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నామని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


# గాయత్రి విద్యానికేతన్‌లో రాజ్యాంగ దినోత్సవం





**పెద్దపల్లి, నవంబర్ 26 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో జాతీయ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. న్యాయశాఖ అతిథులు విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యత, న్యాయవ్యవస్థ పాత్ర, పౌరుల హక్కులు -బాధ్యతలపై సందేశాలు అందించారు. రాజ్యాంగ విలువలను ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి కుంచాల సునీత, అదనపు జిల్లా జడ్జి కుంచం స్వప్న రాణి ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్. శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యుడు కె. శ్రీధర్, న్యాయవాదులు ఝాన్సి, హనుమాన్ సింగ్, శరత్, బర్ల రమేష్, చైర్మన్ అలెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని దేవి పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో విజేతలైన అమృత వర్షిణి, ఆదిబా అంజుమ్, సాయి తనీష్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ రాజ్యాంగంపై అవగాహన అవసరం - గోపీ శంకర్



**అబ్దుల్లాపూర్ మెట్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారానే ప్రజలకు సమన్యాయం, సమపాలన, సమానత్వం లభిస్తుందని తెలిపారు.ఆంగ్లేయుల పరిపాలన అనంతరం మనకంటూ ప్రత్యేక విధి విధానాలు అవసరమని, దాదా సాహెబ్ అంబేద్కర్ సారధ్యంలో రాజ్యాంగం రూపుదిద్దుకుని నవంబర్ 26, 1949న ఆమోదం పొందిందని గుర్తు చేశారు.ప్రతి భారతీయుడు రాజ్యాంగాన్ని గౌరవించి, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజ్యాంగం వలన సామాన్యుడికి కూడా పాలనలో భాగస్వామ్యం చేసే అధికారం లభించిందని, రాచరికం అంతరించి ప్రజాస్వామ్యం స్థిరపడిందని అన్నారు.ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, చైతన్యం పెంపొందాలని గోపీ శంకర్ పిలుపునిచ్చారు.

# తపస్ మండల అధ్యక్ష
## పధాన కార్యదర్శుల ఎన్నిక

**హయత్‌నగర్,నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా తపస్ హయత్‌నగర్ మండల అధ్యక్షుడిగా చీర నర్సింహా, ప్రధాన కార్యదర్శిగా వడ్ల సురేష్ కుమార్, అబ్దుల్లాపూర్మెట్ మండల అధ్యక్షుడిగా గంట గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరి గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీ రావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, రాష్ట్ర బాధ్యులు మెరువ శ్రీహరి కృష్ణ, జిల్లా బాధ్యులు బి. శంకర్, కె. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏకగ్రీవ పంచాయతీలకు రూ.20 లక్షల నజరానా

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**మానకొండూర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వచ్చే నెల రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీల అభివృద్ధికి రూ.20 లక్షలు ప్రోత్సాహంగా అందజేస్తానని ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు.ఎల్ఎండీ కాలనీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏకగ్రీవాలపై దృష్టి సారించాలని, మెజార్టీ సర్పంచులను గెలిపించి పంచాయతీలపై పట్టు సాధించాలని సూచించారు. గెలుపు అవకాశాలు ఉన్నవారినే పోటీకి నిలపాలని, అభ్యర్థుల ఎంపికలో జాప్యం జరగొద్దని అన్నారు.ఈ సమావేశంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ అధ్యక్షులు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షులు గోపగోని బస్వయ్య గౌడ్, నందగిరి రవీంద్రచారి, మాజీ ఎంపీపీలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కు నివాళి




**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ కోర్ట్ చౌరస్తాలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గాలిపెల్లి కుమార్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 26న దేశమంతట రాజ్యాంగ దినోత్సవం, సమ్మిదాన్ దివాస్, జాతీయ చట్ట దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. 76 ఏళ్ల భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి, జాతీయ ఐక్యతకు పునాదిగా నిలిచిందని అన్నారు. రాజ్యాంగం మన హక్కులు, బాధ్యతలు, ప్రజాస్వామ్య విలువలకు దిశానిర్దేశం చేస్తుందని, వాటిని కాపాడుతూ దేశ అభ్యున్నతికి కట్టుబడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## బీజేపీ మద్దతిచ్చే అభ్యర్థులను సర్పంచులుగా ఏకగ్రీవం చేయండి



**హుస్నాబాద్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీజేపీ మద్దతున్న అభ్యర్థులను సర్పంచులుగా ఏకగ్రీవం చేస్తే ఆ గ్రామ పంచాయతీలకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చొరవతో రూ.10 లక్షల నిధులు అందిస్తామని సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి రూపాయి కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ కూడా ఇలాంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చేది కేంద్రమేనని, కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ మద్దతుదారులు గెలిస్తే కొత్త నిధులు రాకపోవచ్చని హెచ్చరించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ రూ.5 కోట్ల నిధులతో ఆసుపత్రులకు ఆధునిక పరికరాలు అందించారని, విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించారని, సైకిళ్లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా కోట్లాది రూపాయలు తెచ్చి విద్య, వైద్య రంగాల్లో ఖర్చు చేశారని తెలిపారు. పంచాయతీల అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థులను ఏకగ్రీవం చేయాలని పిలుపునిచ్చారు.

## భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ



**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ పమేలా సత్పతి అధికారులు, సిబ్బంది చేత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, రాజ్యాంగ పరిరక్షణతో పాటు దేశ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఏవో సుధాకర్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియం భవనానికి పూర్వవైభవం తీసుకురావాలి






**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా సైన్స్ మ్యూజియం పురాతన భవనానికి పూర్వ వైభవం తీసుకురావాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కరీంనగర్ ప్రభుత్వ పురాతన పాఠశాలలో గల మ్యూజియం ఆధునీకరణ పనులను ఆమె మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక సైన్స్ మ్యూజియం కరీంనగర్లో ఉండడంతో అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. భవనం ఆధునీకరణతో పాటు విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానం అందించే పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మ్యూజియంలోని గదులను ఆధునికంగా తీర్చిదిద్దడంతో పాటు ఆవరణలో ఫౌంటెన్, మొక్కలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాల ప్రదర్శన కోసం ప్రత్యేక గదులను కేటాయించాలని సూచించారు. 15 రోజుల్లో పనులను పూర్తి చేసి మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, కోఆర్డినేటర్ మిల్కురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు మోసాలకు బీజేపీ నిరసన



**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజలకు ఆరు పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్తలు నిరసన తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 63వ డివిజన్ బూత్‌లలో శక్తి కేంద్ర ఇన్చార్జ్ రెడ్డేడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వాకర్స్ మైదానంలో ప్రజలను కలసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు పబ్బల్ల ఆంజనేయులు, దయ్యాల కరుణాకర్, నేరెళ్ల ధనలక్ష్మి, పెద్ది లావణ్య, వోల్లెం సంజీవ్ కుమార్‌తో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తుండగా బొమ్మకల్ లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. దుర్శేడ్ గ్రామానికి చెందిన మోటం రాజు, రాంనగర్‌కు చెందిన బుడుగు రాజు అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. ఎమ్మార్వో ముందు బైండోవర్ చేయడమైనదని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

## స్వర్గీయ కొంజర్ల నారాయణకు ఘన నివాళి



**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మంచిరియాల్‌కు చెందిన కొంజర్ల నారాయణ ఇటీవల మృతి చెందగా, ఆయన వైకుంఠ సమారాధన సందర్భంగా బుధవారం మధ్యాహ్నం వారి గృహంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. “కామ్రేడ్ నారాయణ అమరహై” అంటూ నినాదాలు చేస్తూ ఆయన సేవలను కొనియాడారు.సంతాప సభలో పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల రామేశం, జనరూపం సంపాదకులు వొజ్జల రాజమౌళి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యమ నాయకులు నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## హుస్నాబాద్‌లో 76వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా




**హుస్నాబాద్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణ అంబేద్కర్ చౌరస్తాలో వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితకాలం మొత్తం అట్టడుగు వర్గాల కోసం శ్రమించి భారత రాజ్యాంగాన్ని అందించారని, రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, యువతకు అది మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల చంద్రమౌళి, కండే సుధాకర్, కొమ్ముల సంపత్, గడిపే కొమురయ్య, కాదాసు థామస్, రేణికుంట్ల బిక్షపతి, వేముల జగదీష్, గూటం రాజు, బెజ్జంకి బాబు, బత్తుల రవీందర్, గడిపే బాలు, వెంకటేష్, వీరన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో జూడో సెలక్షన్స్




**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డిస్టిక్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్లో సీనియర్ జూడో సెలక్షన్స్ నిర్వహించారు. స్త్రీ పురుషులు కలిపి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా వన్ టౌన్ ఎస్ఐ రాజన్న హాజరై క్రీడాకారులు స్టేట్ లెవల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ దామోదర్ క్రీడతో పాటు విద్యలో కూడా రాణించాలని చెప్పారు. కార్యక్రమంలో జూడో ప్రెసిడెంట్ ఎస్ వినయ్, జాయింట్ సెక్రటరీ ఎస్ రవీంద్ర చారి, గోలి సుధాకర్, కోచులు సాయిరాం, శ్యాములు పాల్గొన్నారు. మెన్ విభాగంలో రామ్ తేజ్, మహీధర్, విశిక్, వినీత్, నదీమ్ బేగ్, కుషాల్, అజయ్ కుమార్ ఎంపికయ్యారు. ఉమెన్ విభాగంలో అంకిత, లావణ్య, నిఖిత, సాహిత్య, మేఘన, శ్రీలత, నందిక ఎంపికయ్యారు. వీరు ఈనెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు.

## కిసాన్ గ్రామీణ మేళా తేదీల్లో మార్పు




**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీల ప్రకటన, ఎన్నికల నియమావళి అమలు మరియు మేళా వేదిక అనుమతుల్లో వచ్చిన మార్పుల కారణంగా కిసాన్ గ్రామీణ మేళా నిర్వహణ తేదీలను మార్చారు. ముందుగా డిసెంబర్ 1, 2, 3న జరగాల్సిన ఈ మేళా ఇప్పుడు డిసెంబర్ 24, 25, 26న నిర్వహించబడనుంది. ఆయా మార్పులను దృష్టిలో ఉంచుకుని అందరూ సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం వైభవంగా



**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సుబ్రహ్మణ్య స్వామి జన్మదినం సందర్భంగా నగునూర్‌లోని దుర్గాభవానీ దేవాలయంలో వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ స్వామి వారికి అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతులు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో కల్యాణ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మన్, కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, ముక్క ప్రభాకర్, నీరుమల్ల తిరుపతి, రాచమల్ల ప్రసాద్, పల్లెర్ల శ్రీనివాస్, అంజనేయులు, మాజీ కార్పొరేటర్ వంగళ శ్రీదేవితో పాటు భక్తులు పాల్గొన్నారు.

## శాతవాహన న్యాయ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం



**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: శాతవాహన విశ్వవిద్యాలయ న్యాయ కళాశాలలో 76వ రాజ్యాంగ దినోత్సవం సెమినార్ హాల్లో ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో జిల్లా సెషన్స్ ప్రిన్సిపాల్ శివకుమార్ రాజ్యాంగ దినోత్సవం చారిత్రక ప్రాముఖ్యతను గుర్తుచేశారు. సభాధ్యక్షత వహించిన ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ రాజ్యాంగం సమానత్వం, న్యాయం, సమగ్రతను హామీ ఇస్తుందని, విద్యార్థులు వివక్షతలకు వ్యతిరేకంగా నిలబడి రాజ్యాంగ నైతికతను ఆచరించాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు రాజ్యాంగం ప్రజాస్వామ్య గణతంత్ర ప్రతిపత్తిని తెచ్చిందని, పౌరులు దానిని గౌరవించి ఉత్తమ పౌరులుగా నిలవాలని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. టు విసి రాజ్యాంగం ద్వారా ప్రభుత్వ వ్యవస్థలు సమర్థవంతంగా నడుస్తాయని వివరించారు. ఆచార్య సుజాత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు ప్రసాదించిందని, వెనుకబడిన వర్గాల బలోపేతానికి అంబేద్కర్ ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు.రాజ్యాంగ పీఠిక లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేసిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. వెంకట్ కన్నా, అనిల్ సింగ్, అరుణ్ సింగ్, రజని, ప్రియా రాఘవేంద్ర, డా. జాఫర్, డా. హుమేరా, డా. నజీముద్దీన్ మునవర్, డా. యశ్వంతరావు, డా. లక్ష్మీనారాయణ, డా. కృష్ణకుమార్, డా. ప్రదీప్, డా. రమేష్, సావిత్రి, డా. పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నగర సమస్యలపై ముట్టడి సిద్ధం

**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలోనే నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించనున్నామని బిఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తెలిపారు. మంకమ్మతోటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరపాలక సంస్థను నరక పాలక సంస్థగా మార్చిందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ఎన్నో వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని, వీధి కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హయాంలో 135 కోట్ల రూపాయల పనులు చేపట్టగా, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క రూపాయి పని చేయలేదని అన్నారు. రోడ్లు ధ్వంసమై దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎల్ఎండిలో నీరు ఉన్నా మంచినీరు అందించలేని పరిస్థితి ఉందని విమర్శించారు. నగరపాలక సంస్థలో అవినీతి పెరిగిందని, టౌన్ ప్లానింగ్ అధికారులు ముడుపులు ముట్టనిదే పనులు చేయడం లేదని ఆరోపించారు. చెత్త సేకరణ సరిగా




జరగకపోవడం, పారిశుద్ధ్యం లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు మూడు రోజుల్లో నగరపాలక సంస్థ ముట్టడికి నగర ప్రజలు, పార్టీ శ్రేణులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో పాటు నగర మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, నగర యూత్ ప్రధాన కార్యదర్శి బోనకుర్తి సాయి కృష్ణ, నియోజకవర్గ మైనార్టీ యూత్ అధ్యక్షుడు నవాజ్, 55వ డివిజన్ అధ్యక్షుడు చేతి చంద్రశేఖర్, 37వ డివిజన్ అధ్యక్షుడు ఆరె రవి గౌడ్, 14వ డివిజన్ అధ్యక్షుడు ఎడబోయిన శ్రీనివాసరెడ్డి, 29వ డివిజన్ అధ్యక్షుడు జెల్లోజీ శ్రీనివాస్, గూడెల్లి రాజ్‌కుమార్, నారదాసు వసంతరావు, యూత్ నాయకులు నాగుల కిరణ్ కుమార్ గౌడ్, ఒడ్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్, నాయకులు అనుమల్ల ఉమాశంకర్, మేచినేని పవన్ రావుతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడిపెల్లి సత్యం సన్మానం



కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన చొప్పదండి శాసనసభ్యుడు మేడిపెల్లి సత్యాన్ని కరీంనగర్ బాలాజి నగర్‌లోని వారి నివాసంలో జిల్లా కురుమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న, రాష్ట్ర కార్యదర్శి ఎల్కపెల్లి లచ్చయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మేకల నర్సయ్య, చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు ఒగ్గు మల్లేశం, పంచాయితీ కమిటీ జిల్లా అధ్యక్షుడు కోరె గట్టయ్య, రామడుగు మండల అధ్యక్షుడు కడారి వీరయ్య, సెవ్వాల్ల గంగయ్య, పెద్ది తిరుపతి, ఎల్లమ్మల కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందించడంలో పారా లీగల్ వాలంటీర్ల పాత్ర

**మహబూబాబాద్, నవంబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

భారత రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన “అందరికీ అందుబాటులో న్యాయం” అనే లక్ష్యాన్ని చేరుకోవడానికి పారా లీగల్ వాలంటీర్లు కృతనిశ్చయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ రఫీ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో పారా లీగల్ వాలంటీర్లకు పునఃశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్, ఉచిత న్యాయ




సహాయం, మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా కేసుల సత్వర పరిష్కారం వంటి న్యాయ సేవా సంస్థ విధులను ప్రజలకు వివరించాలని సూచించారు. ఇటీవలి కాలంలో అసంఘటిత రంగ కార్మికులకు భీమా కార్డులు ఇప్పించడం, పాక్షిక అనాధ బాలికను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వంటి సేవా కార్యక్రమాలలో పారా లీగల్ వాలంటీర్లు చూపిన కృషిని ఆయన అభినందించారు. న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శాలిని షాకెల్లి మాట్లాడుతూ జాగృతి, డాన్, ఆశా, సంవాద్, స్పృహ వంటి పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి వాటిని వారు వినియోగించుకునేలా కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో న్యాయమూర్తులు పారా లీగల్ వాలంటీర్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**అబ్దుల్లాపూర్ మెట్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



హయత్‌నగర్ మండల కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం మనకు స్వేచ్ఛ, హక్కులు, సామాన్యత్వం, న్యాయం వంటి ప్రాథమిక విలువలను అందించిందని, దేశాన్ని ఒకే తాటిపై ఐక్యంగా నడిపించే మార్గాన్ని చూపిందని పేర్కొన్నారు. బాధ్యత గల పౌరులుగా రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. 1949 నవంబర్ 26న ఆమోదించబడిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దదని గుర్తుచేసి, రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. “కాపాడుకుందాం భారత రాజ్యాంగాన్ని” అని నినదిస్తూ రాజ్యాంగ దినోత్సవ స్ఫూర్తితో ముందుకు సాగాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పారంద స్వామి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ఎర్ర రవీందర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తరి భీమ్ రాజు, తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు పంది గోటి ఎల్లయ్య, జెనిగే రమేష్, మోకాస్ లక్ష్మణ్, బీసీ నాయకులు దశరథ, కుమార్, సతీష్, వెంకన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనేక మంది ప్రజలు, సంఘాల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలంగాణలో 60 వేల కోట్లతో అభివృద్ధి పనులు

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్గొండ, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో నాగార్జునసాగర్ ఎక్స్‌రోడ్ నుండి దర్వేశిపురం ఎల్లమ్మ దేవాలయం వరకు మహబూబ్‌నగర్ నల్గొండ రహదారిని నాలుగు లైన్లుగా, సెంట్రల్ మీడియన్, సెంట్రల్ లైటింగ్‌తో నిర్మించేందుకు 50 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వారం రోజుల్లో రహదారి పనులు ప్రారంభమవుతాయని, దర్వేశిపురం వద్ద జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే 12 కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, మీడియన్ నిర్మించామని తెలిపారు. జిల్లాలో కొత్తపల్లి, ముషంపల్లి రహదారులతో పాటు అన్ని గ్రామాలకు రహదారులు, మురుగు కాలువలు ఏర్పాటు చేస్తున్నామని, ఏఎంఆర్పీ కాలువల లైనింగ్‌కు 450 కోట్ల రూపాయలు మంజూరు చేయించామని వెల్లడించారు. నల్గొండ పట్టణంలో ప్రధాన రహదారుల అభివృద్ధిలో భాగంగా సెంట్రల్ మీడియన్, లైటింగ్ ఏర్పాటు చేసి, బైపాస్ రహదారి పనులు చేపట్టామని చెప్పారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని



విమర్శిస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమలు ప్రారంభమైందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలే నడిపే బస్సులు, 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు భరోసా, సన్న బియ్యం, సన్న ధాన్యం పండించిన వారికి 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని వివరించారు. రాబోయే మూడేళ్లలో ఇల్లు లేని పేదవారు ఉండకుండా ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని, ప్రతి గ్రామంలో రేషన్ షాపులు ఏర్పాటు చేస్తామని, తన నియోజకవర్గంలో ఇప్పటికే 18 కొత్త రేషన్ షాపులు ప్రారంభించామని తెలిపారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, వచ్చే మూడేళ్లలో గ్రామాల స్వరూపాలను మార్చుతామని అన్నారు. మహిళా



సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, కనగల్, తిప్పర్తి, నల్గొండ మండలాల్లో మహిళల చేత రైస్ మిల్లుల నిర్వహణకు మిల్లులు నిర్మించి ఇస్తామని తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను డిసెంబర్‌లో ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభిస్తారని వెల్లడించారు. నీటిపారుదల అభివృద్ధిలో భాగంగా ఏఎంఆర్పీ కాలువల లైనింగ్, చెట్ల తొలగింపు, చెరువుల నింపివేత వంటి పనులు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమానికి ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, కనగల్ మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ



**మహబూబాబాద్, నవంబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

జిల్లా కేంద్రం శివారు అనంతారం లోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల సృజనాత్మకత ప్రతిభ ప్రతిభావంతంగా వెలుగుచూసింది. సుమారు 320 ఎగ్జిబిట్‌లను జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల నమూనాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎగ్జిబిట్‌ల పనితీరును ఆసక్తిగా పరిశీలిస్తూ, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ ఆలోచనలను తెలుసుకోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారా భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగగలరని, ఉపాధ్యాయులు చదువుతో పాటు విజ్ఞానాన్ని అందిస్తే విద్యార్థులు దేశానికి గర్వకారణమవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కొత్తపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్, నవంబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ స్వాగతం పలికగా కమిషనర్ సాయుధ దళ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది పరేడ్, రికార్డులు, సీసీటీఎన్ఎస్‌లో నమోదైన కేసులను పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిఘా పెట్టాలని ఆదేశించారు. కొత్తగా చేరిన కానిస్టేబుళ్లు విధులను నేర్చుకుని నిజాయితీ, క్రమశిక్షణ పాటించాలని సూచించారు. స్టేషన్ పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ బాగుందని ఇన్స్పెక్టర్



బిల్లా కోటేశ్వర్ మరియు సిబ్బందిని కమిషనర్ అభినందించారు. ఈ తనిఖీలో ఎస్సైలు సాంబమూర్తి, చీనా నాయక్, సంజీవ్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.